సాక్షి నంద్యాల

శనివారం, 2, ఆగస్టు, 2025



ఇక వార్షిక ఫాస్టాగ్

హైవేలపై ప్రయాణించే వ్యక్తిగత వాహనదారుల ప్రయాణ ఖర్చులు తగ్గనున్నాయి. కేంద్రం ఆదేశాల మేరకు వార్షిక ఫాస్టాగ్ ఆఫర్ ఈ నెల 15 నుంచి అమలులోకి రానుంది. 8లో ▸



హుండీ ఆదాయం రూ.1.22 కోట్లు

కౌతాళం: ఉరుకుంద దేవాలయంలో హుండీని శుక్రవారం లెక్కించారు. నగదు రూపంలో రూ.1,22,88,424, వెండి 23 కేజీల 230 గ్రాములు, బంగారం 34 గ్రాముల 600 మిల్లీ వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,625.13
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 76.912
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 46,883
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 35,312

బయో చీడ.. నకిలీల పీడ!

జీ-2 మాటున దందా

- జిల్లాను ముంచెత్తుతున్న అనుమతిలేని బయో స్టిములెంట్స్
- గుంటూరు జిల్లా కేంద్రంగా ఉమ్మడి కర్నూలులోకి దిగుమతి
- మార్కెట్‌లోకి దొంగ బయోలు, నకిలీ పురుగు మందులు
- తూతూ మంత్రంగా స్క్వాడ్ బృందాల తనిఖీలు
- కర్ణాటక, తెలంగాణ నుంచీ అక్రమ విక్రయాలు

జీ-2 అనుమతి ఉన్న కంపెనీ ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్రంగా పనిచేస్తోంది. ఈ కంపెనీకి 6 ఉత్పత్తులకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. అయితే 25 రకాల ఉత్పత్తులను ఉమ్మడి కర్నూలు జిల్లాలో విక్రయిస్తున్నా వ్యవసాయ శాఖ నోరు మెదపని పరిస్థితి.

.. బయో అమ్మకాల్లో కాసుల పంట పండుతుండటంతో అనేక మంది డీలర్లు వీటి అమ్మకాలపై మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. కొంత మంది డీలర్లు కాలంచెల్లిన పురుగు మందులను బయోల పేరిట విక్రయిస్తున్నారు. ఆకర్షించే ప్యాకింగ్, పేర్లతో రైతులను మోసగిస్తున్నారు.

ఇటీవల తనిఖీలకు వచ్చిన స్క్వాడ్ బృందాలు ఫామ్ జీ-2 చూడటంతోనే అంతా సవ్యంగా ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇన్‌వాయిస్ బిల్లులను పట్టించుకున్న దాఖలాలు లేవు. వీటిని పరిశీలించినప్పుడే దొంగ బయోల గుట్టురట్టవుతుంది. అయితే ఆ దిశగా చర్యలు లేకపోవడం మామూళ్ల బంధానికి నిదర్శనంగా తెలుస్తోంది.



కర్నూలు(అగ్రికల్చర్): ఇటీవల కాలంలో అక్కడక్కడ వర్షాలు కురుస్తుండటంతో వివిధ పంటల్లో చీడపీడల బెడద కనిపిస్తోంది. ఇదే అదనుగా దొంగబయోలు, నకిలీ పురుగుమందులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో రైతులు వీటి బారిన మోసపోయే పరిస్థితి నెలకొంది. ఎలాంటి బయోలు లేవని వ్యవసాయ శాఖ చెబుతోంది. బయోలన్నీ ఫర్టిలైజర్ చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. వీటిని ప్రస్తుతం బయో స్టిములెంట్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 45 బయోస్టిములెంట్స్ కంపెనీలకు సంబంధించి 593 ఉత్పత్తులను మాత్రమే మార్కెటింగ్ చేసుకునే వీలుంది. అయితే పలు కంపెనీలు అనుమతిలేని వాటిని కూడా మార్కెటింగ్ చేసుకుంటూ రైతులను దగా చేస్తున్నారు. బయో స్టిటులెంట్స్‌కు కేంద్రం అనుమతి తప్పనిసరి. రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు పంపితే కేంద్రం ఫాం జీ-2 కింద అనుమతులు ఇస్తుంది. ఈ పేరుతో అడ్డగోలుగా అనుమతి లేని ఉత్పత్తులను పలు కంపెనీలు గుట్టుచప్పుడు కాకుండా మార్కెటింగ్ చేసుకుంటున్నాయని సమాచారం. ఇకపోతే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా దొంగబయోలు జిల్లాలోకి దిగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని ఆటోనగర్‌లో దొంగ బయోలు ఉత్పత్తి చేసి జిల్లాలకు తీసుకొస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

రంగంలోకి టీడీపీ నేతల కంపెనీలు

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ నేతల బయో కంపెనీలు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఆయా కంపెనీలు గత ఏడాది నుంచే పెద్ద ఎత్తున అనుమతులు లేని నకిలీలను మార్కెట్‌లోకి దింపినట్లు సమాచారం. జీ-2 మాటున పెద్ద ఎత్తున దొంగ బయోలను మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఎమ్మిగనూరు, గూడూరు, సీ.బెళగల్, దేవనకొండ, ఆదోని, ఆలూరు, మంత్రాలయం తదితర మండలాల్లో బయో స్టిములెంట్స్ పేరుతో దొంగ బయోలు వెల్లువెత్తుతున్నాయి.

నకిలీలు, దొంగ బయోలకు నిలయంగా కర్నూలు జిల్లా

మార్కెట్‌లో నకిలీ పురుగు మందులు, దొంగ బయోలు ఎక్కువగా ఉన్నాయి. ఎమ్మిగనూరు ప్రాంతంలో నకిలీ పురుగు మందులను దర్జాగా షాపుల్లోనే విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎమ్మిగనూరులో దాదాపు రూ.కోటి విలువ నకిలీ పురుగు మందులను వ్యవసాయ శాఖకు చెందిన స్క్వాడ్ అధికారులు సీజ్ చేశారు. నిషేధిత పురుగు మందులు, విషపూరితమైన పురుగుమందులు, కాలం చెల్లిన వాటిని కొందరు అక్రమార్కులు పేరుమార్చి బయోలు, ఇతర పురుగుమందుల పేర్లతో మార్కెట్‌లోకి గుట్టుచప్పుడు కాకుండా విడుదల చేస్తున్నారు.

తూతూమంత్రంగా తనిఖీలు

ఎరువులు, విత్తనాలు, పురుగుమందులపై కూటమి ప్రభుత్వం ఇటీవల నియమించిన ప్రత్యేక స్క్వాడ్ బృందాల తనిఖీలు నామమాత్రమే. స్క్వాడ్ బృందాల్లో వ్యవసాయ శాఖకు చెందిన ఏడీఏలు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చెందిన అధికారులు ఉన్నారు. ఒక టీమ్ 10, మరో టీమ్ 8 మండలాల్లో తనిఖీలు నిర్వహించింది. స్క్వాడ్ అధికారులు తనిఖీలకు వస్తున్నారనే విషయంపై సంబంధిత వ్యవసాయ సిబ్బంది ముందుగానే డీలర్లకు చేరవేసినట్లు చర్చ జరుగుతోంది. డీలర్లకు, వ్యవసాయ యంత్రాంగానికి మధ్య మామూళ్ల బంధం ఉండటం వల్ల ఎవరు తనిఖీలకు వచ్చినా ముందస్తుగా సమాచారం చేరవేస్తుండటం గమనార్హం.



ఎమ్మిగనూరులో సీజ్ చేసిన నకిలీ పురుగు మందులు (ఫైల్)

జిల్లాలో ప్రధాన పంటలు
పత్తి, మిరప, ఉల్లి, మొక్కజొన్న, కంది, వేరుశనగ
ప్రస్తుత సీజన్‌లో సాగు(హెక్టార్లలో..) 2.19 లక్షలు
పత్తి సాగు(హెక్టార్లలో..) 1.83 లక్షలు

న్యూస్‌రీల్

బ్యాంకుల్లో చోరీలు లేకుండా కట్టుదిట్టమైన భద్రత

- జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నంద్యాల: బ్యాంకుల్లో దొంగతనాలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. బ్యాంకుల్లో భద్రతా ప్రమాణాలపై శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్లతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలతో పాటు మధ్యప్రదేశ్, హర్యానా, తమిళనాడు రాష్ట్రాల్లోని బ్యాంకుల్లో చోరీలు జరిగాయని, అలాంటి ఘటనలు జిల్లాలో జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. నగదు రవాణా సమయంలో శిక్షణ పొందిన లైసెన్స్ కలిగిన ఆయుధం ఉన్న గార్డులను నియమించాలని సూచించారు. బ్యాంక్‌లో అత్యవసర కాల్ నంబర్లు, సైబర్ క్రైమ్‌కు సంబంధించిన హెల్ప్ లైన్ నంబర్లను స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు బ్యాంకు అధికారులకు, పోలీసు స్టేషన్‌కు కాల్ చేసే సౌకర్యంతో కూడిన అలారం వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు

నంద్యాల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాకు చెందిన పలువురికి పార్టీ అనుబంధ రాష్ట్ర కమిటీలో చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా కురువ సుంకన్న(పాణ్యం), రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా ఎస్.నాగేంద్ర(పాణ్యం), రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రటరీగా ఏవీ కృష్ణారెడ్డి(శ్రీశైలం), రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ కార్యదర్శిగా ఎస్‌వీ రమణారెడ్డి(శైలం), రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా కె.బాబు(పాణ్యం), రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా వి.రామకృష్ణుడు(శ్రీశైలం), రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా బి.అబ్దుల్‌ఖాదర్ జిలానీ(శ్రీశైలం)లను నియమించారు.

గురుకులాల్లో నేరుగా ప్రవేశాలు

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీయట్‌లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, నేరుగా భర్తీ చేయనున్నట్లు డీసీఓ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరికెల బాలుర కళాశాలలో సీఈసీలో ఎస్సీలకు 48, కంబాలపాడు బాలికల కళాశాలలో సీఈసీలో నాలుగు సీట్లు, బైపీసీ, జనరల్ విభాగంలో ఒక సీటు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో పదో తరగతిలో 24, సీనియర్ ఇంటర్‌లో 2002, నంద్యాల జిల్లాలోని పదో తరగతిలో 16, సీనియర్ ఇంటర్‌లో 88 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9866616633, 9010070219 నంబర్లను సంప్రదించాలన్నారు.

నాణ్యతతో 'అమృత్' పనులు పూర్తి చేయాలి



డోన్ రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న శ్రీవాత్సవ్

డోన్ టౌన్: అమృత్ భారత్ మహోత్సవ్ పథకం కింద చేపట్టిన పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని రైల్వే సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ సంజీవ్‌కుమార్ శ్రీవాత్సవ ఆదేశించారు. ప్రత్యేక రైలులో గుంతకల్లు నుంచి హైదరాబాద్‌వైపు వెళుతూ డోన్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం కాసేపు ఆగారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, గుంతకల్లు డివిజన్ అధికారులు ఉన్నారు.

ఆభరణాలు, వెండి పళ్లెం బహూకరణ



అహోబిలంలో ఆభరణాలు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: అహోబిలం లక్ష్మీనరసింహస్వామికి రూ.1.50 లక్షల విలువ చేసే ఆభరణాలను డోన్ పట్టణం కొండపేటకు చెందిన భాస్కర్‌గౌడ్, అరుణ్‌జ్యోతి దంపతులు బహూకరించారు. అలాగే డోన్ శ్రీషిర్డీ సాయిబాబా గుడికి రూ.43వేల విలువ చేసే వెండి పళ్లెం శుక్రవారం అందజేశారు.

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రైవేట్ గూండాల దుర్మార్గ చర్య



బనగానపల్లెలో కూల్చివేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించేందుకు ప్రజలతో కలసి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

- ప్రజలకు మంచినీరు అందకుండా చేశారు
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వకుండా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి చెందిన ప్రైవేట్ గూండాలు పోలీసుల బందోబస్తుతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బనగానపల్లె పట్టణం పాతబస్టాండ్‌లో కూల్చివేసిన వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం భారీ జనసందోహం మధ్య మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్టాండ్‌లోని గ్రామ పంచాయతీ స్థలంలో 2019లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రభుత్వ నిధులతో ప్రజల అవసరం కోసం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించానన్నారు. అప్పటి నుంచి పట్టణ ప్రజలతో పాటు బనగానపల్లెకు వచ్చే గ్రామీణులు ఈ ప్లాంట్ నుంచే మంచినీటిని పొందేవారన్నారు. వాటర్ ప్లాంట్‌పై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, తన ఫొటోను ఉండటాన్ని చుస్తూ ఓర్వలేక ప్రైవేట్ గూండాలతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇంటి సమీపంలో ఉన్న వాటర్ ప్లాంట్‌ను కూల్చివేయడం దారుణమన్నారు. ఈ విషయంపై రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులను అడిగితే కూల్చివేతపై తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల వద్ద తన ఫొటో ఎక్కడైనా అగుపిస్తే టీడీపీ వారు స్టిక్కర్లు అతికిస్తున్నారని, ఎన్నికల కోడ్ ఏమైనా అమల్లో ఉందా అని ప్రశ్నించారు. వాటర్ ప్లాంట్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి చెందిన సొంత స్థలంలో ఏమీ నిర్మించలేదన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్‌తో పాటు సమీపంలోని చిరువ్యాపారుల దుకాణాలను కూడా కూల్చడం హేయమైన చర్య అన్నారు. బీసీ జనార్దన్‌రెడ్డి గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బనగానపల్లె పట్టణంలో సొంత నిధులతో పాటు ప్రభుత్వ నిధులతో నిర్మించిన వాటర్ ప్లాంట్స్‌ను తాను అధికారంలో ఉన్న సమయంలో ఎప్పుడూ కూల్చలేదన్నారు. కాటసాని కుటుంబం 40 సంవత్సరాలుగా రాజకీయంలో ఉందని, ఏనాడూ ప్రభుత్వ ఆస్తులను కూల్చలేదని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బనగానపల్లె పట్టణంలో వంద పడకల వైద్యశాలతో పాటు సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు నిర్మించానని వాటిని కూడా కూల్చివేస్తారా అంటూ ప్రశ్నించారు.

కూల్చివేసిన వారిపై ఫిర్యాదు చేయాలి

మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూల్చివేసేందుకు బాధ్యులైన వారిపై రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. వాటర్ ప్లాంట్ కూల్చివేతతో ఇక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని, లేదంటే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. కాటసాని వెంట అవుకు, బనగానపల్లె వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాది అబ్దుల్‌ఖైర్, ముస్లిం మైనార్టీ నాయకుడు అత్తార్‌జాహెద్, నాయకులు శంకర్‌రెడ్డి, సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, అనిల్, సురేష్, కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రవికుమార్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ప్రత్యేక రైలు స్టాపింగ్‌కు అనుమతి

కోవెలకుంట్ల: నంద్యాల-యర్రగుంట్ల రైల్వే మార్గంలో ప్రతి శని, ఆదివారాల్లో తిరిగే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలుకు కోవెలకుంట్ల స్టేషన్‌లో స్టాపింగ్‌కు అనుమతిచ్చినట్లు స్టేషన్‌మాస్టర్ గురుచరణ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 0718907190 నంబర్ రైలు తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా నాందేడ్ నుంచి చర్లపల్లి, నల్లగొండ, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పిడుగురాళ్ల, మార్కాపురం, నంద్యాల, కోవెలకుంట్ల, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు, తిరుపతి, మదనపల్లి మీదుగా ధర్మవరం వరకు ప్రతి శనివారం నడుస్తోందన్నారు. ఉదయం 6.20 గంటలకు కోవెలకుంట్లకు చేరుకుంటుందన్నారు. ఇదే రైలు తిరుగు ప్రయాణంలో ఆదివారం ధర్మవరం నుంచి బయలుదేరి తిరుపతి మీదుగా కోవెలకుంట్లకు మధ్యాహ్నం 3.15 గంటలకు వస్తుందన్నారు. గతంలో ఈ రైలుకు కోవెలకుంట్లలో స్టాపింగ్ లేదని, ప్రయాణికుల సౌకర్యార్థం శనివారం నుంచి స్టాపింగ్‌కు అనుమతినిస్తూ దక్షిణమధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.

పోతిరెడ్డిపాడు నుంచి 35వేల క్యూసెక్కుల నీటి విడుదల

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను 31వేల నుంచి 35వేల క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలోకి 3,17,980 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా డ్యాంలో నీటి మట్టం 882.50అడుగులకు చేరుకుందన్నారు. పోతిరెడ్డిపాడు వద్ద 881.50అడుగుల నీటిమట్టం నమోదు కాగా.. హెడ్‌రెగ్యులేటర్ 2, 4, 5, 6, 7 గేట్ల ద్వారా 35వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్‌ఎమ్సీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ నీటిని బానకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 14వేల క్యూసెక్కులు, ఎస్సార్బీసీ(జీఎన్‌ఎస్‌ఎస్) కాల్వకు 12వేలు, కేసీ ఎస్కేప్ కాల్వకు 9వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

హాస్టళ్లలో నీళ్ల పప్పుతో అన్నం

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్



కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

నంద్యాల: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నీళ్ల పప్పుతో అన్నం పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు సురేష్‌యాదవ్ అన్నారు. గురుకుల విద్యాలయాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారికి వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కలెక్టరేట్ ఎదుట సురేష్‌యాదవ్ విలేకరులతో మాట్లాడారు. గత నాలుగు రోజులుగా సంక్షేమ హాస్టళ్ల బాట కార్యక్రమం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నామన్నారు. చాలా హాస్టళ్లలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని, విద్యార్థులు నేలపై నిద్రిస్తున్నారని, నేటికీ దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేయలేదని తెలిపారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెనూ ప్రకారం ప్రతి రోజూ గుడ్డు, వేరుశనగ చిక్కీ, వారానికి రెండుసార్లు చికెన్ పెట్టడం లేదన్నారు. మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు జశ్వంత్‌రెడ్డి, హరికిరణ్, రియాజ్‌బాషా, అబ్దుల్లా, శషాంక్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 94 శాతం పింఛన్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో 94 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,15,688 పింఛన్లకు గాను 2,02,600 పింఛన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మిగతా పింఛన్లను 2వ తేదీన పంపిణీ చేస్తామని తెలిపారు. కాగా.. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో పింఛన్లను రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ పంపిణీ చేశారు.

పంద్రాగస్టు వేడుకలకు ఘన ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజలందరిలో దేశభక్తి భావాలు పెంపొందించేలా ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వేడుకలు నిర్వహింపే మైదానాన్ని ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులకు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ శాఖల శకటాలు ప్రత్యేకంగా ఉండాలన్నారు. ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధిపై సందేశ బుక్‌లెట్‌ను సిద్ధం చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు, జిల్లా ప్రజాప్రతినిధులకు, అధికారులకు వేర్వేరుగా కుర్చీలు ఏర్పాట్లు చేయాలన్నారు.

క్లుప్తంగా

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బండి ఆత్మకూరు: స్కూల్‌కి వెళ్లమని తల్లి గట్టిగా మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ బాలుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కడమల కాలువ గ్రామానికి చెందిన శివ లింగం, పార్వతి దంపతుల కుమారుడు బద్రి(11) ఈర్నపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లనని మొండికేయడంతో తల్లి పార్వతి మందలించింది. దీంతో బద్రి మనస్తాపానికి గురై సంతజూటూరు వద్ద గల పికప్ ఆనకట్ట వద్దకు వచ్చి కేసీ కెనాల్‌లో దూకాలని ప్రయత్నించాడు. స్థానికులు గమనించి అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న బంధువులు అక్కడికి చేరుకుని బాలుడిని ఇంటికి తీసుకెళ్లారు.

జిల్లాకు 'ఆస్పిరేషనల్' గోల్డ్ మెడల్

కర్నూలు(సెంట్రల్): ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లాకు రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ లభించింది. ఈ మేరకు కేంద్ర నీతి ఆయోగ్ ప్రకటన చేసింది. అంతేకాక ఆస్పిరేషనల్ బ్లాకుల్లో ఉన్న మద్దికెర మండలానికి రూ.కోటి, చిప్పగిరి మండలానికి రూ.1.5 కోట్ల క్యాస్ ప్రైజ్‌లు కూడా లభించడంతో అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో అత్యంత వెనుకబడిన 500 మండలాలను ఆస్పిరేషనల్ బ్లాక్‌లను గుర్తించి కేంద్ర నీతి ఆయోగ్ అభివృద్ధి చేస్తోంది. జిల్లాలో చిప్పగిరి, మద్దికెర, హాలహర్వి మండలాల్లో ఆరు రకాల అభివృద్ధి పనులను వందశాతం పూర్తి చేశారు. 2024 జూలై 4 నుంచి 2025 జూలై 4 వరకు చేపట్టిన అభివృద్ధి పనులను ఆధారంగా తీసుకుని నీతి ఆయోగ్ అవార్డులను ప్రకటించింది. రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాకు గోల్డ్ మెడల్‌ను ప్రకటించగా త్వరలోనే జిల్లా కలెక్టర్ అందుకోనున్నారు.

మళ్లీ చిరుత సంచారం

గోనెగండ్ల: చిరుత సంచారంతో ఎన్నెకండ్ల, గంజిహళ్లి గ్రామస్తులకు నిద్రకరువైంది. వారం రోజుల క్రితం గంజిహళ్లి శివారులో కట్టేసిన దున్నపోతుపై చిరుత దాడి చేసి చంపేసింది. మరుసటి రోజు అదే ప్రాంతానికి చేరుకుని దున్నపోతు కళేబరాన్ని తిన్నట్లు గ్రామస్తులు గుర్తించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మళ్లీ గంజిహళ్లి పంట పొలాల్లో చిరుతను చూసిన రైతులు, కూలీలు భయంతో పరుగులు తీసి వెనక్కి వచ్చారు. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇస్తున్నా స్పందించం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చిరుతను బంధించి అడవుల్లో వదిలేయాలని కోరుతున్నారు.

తల్లిపాలు.. అమృతధారలు

- శిశువు పుట్టిన గంటలోపే తల్లి పాలివ్వాలి
- ముర్రు పాలలో వ్యాధి నిరోధక శక్తి
- బిడ్డ ఎదుగుదలకు ఎంతో మేలు
- శిశువు ఆరు నెలల వరకు ఇవే ఇవ్వాలి
- జిల్లాలో ఏటా 48 వేలకు పైగా ప్రసవాలు
- అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం



కర్నూలు(హాస్పిటల్): అప్పుడే జన్మించిన బిడ్డకు తల్లిపాలే ఆహారం. అది మనిషైనా...ఇతర ఏ జీవికైనా. జన్మించిన శిశువు తల్లిని తాకగానే ఆమెకు పాలు స్రవిస్తాయి. ఇది సృష్టి ధర్మం. ఈ ధర్మానికి వ్యతిరేకంగా ఇతర పాలను బిడ్డకు పట్టిస్తే అటు బిడ్డకు.. ఇటుకు తల్లికి అనారోగ్యం. అందుకే బిడ్డకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలే పట్టించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇది బిడ్డకు, తల్లికి ఇద్దరికీ మంచిదని సెలవిస్తున్నారు. తల్లిపాల ప్రాముఖ్యత పట్ల తల్లులకు, ఆమె కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఆగష్టు ఒకటి నుంచి ఏడవ తేదీ వరకు అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కొత్తగా మంజూరైన మరో 12 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఇవేగాక ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 26 అర్బన్‌హెల్త్ సెంటర్లు, రెండు ఏరియా ఆసుపత్రులు, ఒక బోధనా సుపత్రి ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల్లో ప్రతి సంవత్సరం 48 వేలకు పైగా గర్భిణులు ప్రసవిస్తున్నారు. పుట్టిన బిడ్డకు ఎలా పాలను పట్టించాలనే విషయమై అక్కడి వైద్య సిబ్బంది బాలింతలకు సూచిస్తున్నారు. తల్లిపాల పట్ల ఆవశ్యకతను తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో విడుదలయ్యే ముర్రుపాలను బిడ్డకు పట్టిస్తే వ్యాధినిరోధక పెరిగి భవిష్యత్‌లో రాకుండా ఉంటాయని వివరిస్తున్నారు. పని చేసే చోట, ఉద్యోగం చేసే చోట తల్లులకు తమ బిడ్డకు పాలిచ్చేందుకు వీలు కల్పించాలి. అందుకు అందరూ సహకారం అందించాలి. ఈ మేరకు ఉన్నంతలో ఏర్పాట్లు చేయాలి.

తల్లి పాలు బాగా రావాలంటే...!

మహిళ గర్భధారణ అయినప్పటి నుంచే పోషకాలు కలిగిన పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా ఆకుకూరలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లను ఆహారంలో చేర్చుకోవాలి. అతిగా స్వీట్లను తినకూడదు.

ఇవి తీసుకోరాదు

బిడ్డకు పాలిచ్చే సమయంలో తల్లి కొన్నింటిపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలి. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలు పట్టకూడదు. పాలిచ్చే సమయంలో కెఫిన్ అధికంగా ఉండే పదార్థాలు, శీతల పానియాలు తీసుకోకూడదు ఇది శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.

ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి

గర్భిణి ప్రసవించిన అనంతరం మొదటి అరగంట లోపు తల్లికి వచ్చే పాలను ముర్రుపాలంటారు. వీటిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. చాలా మంది అవగాహన లేకపోవడం వల్ల బిడ్డకు ముర్రుపాలను తాగించడంలో నిర్లక్ష్యం వహిస్తారు. ఈ పాలలో వ్యాధి నిరోధకశక్తిని పెంచే గుణం ఉంటుంది. సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందజేస్తాయి. చాలా రకాల వ్యాధులు రాకుండా తల్లిపాలు కాపాడతాయి. తల్లికి, శిశువుకు జ్వరం వచ్చినప్పుడు, టీకాలు ఇచ్చినప్పుడు కూడా పాలు పట్టించవచ్చు. తల్లిపాలు తాగే పిల్లల్లో ఆకస్మిక మరణాలు తక్కువేనని వైద్యులు చెబుతున్నారు.

ఎప్పుడు..ఎలా పాలివ్వాలంటే...

తల్లిపాలు ఎంతో స్వచ్ఛంగా, ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి బిడ్డలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. అందుకే బిడ్డ జన్మించిన గంటలోపు తల్లికి వచ్చే ముర్రుపాలు పట్టించాలి. ఆ తర్వాత ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే పదార్థాలూ ఇవ్వకూడదు. రోజులో 8 నుంచి 10 సార్లు లేదా ప్రతి రెండు నుంచి మూడు గంటలకు ఒకసారి బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి.

ఉపయోగాలు

- శిశువుకు తల్లిపాలు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి.
- ఇవి నాణ్యమైన ప్రొటీన్లు, ఒమెగా 3, ఒమెగా 6, ఒమెగా 9, విటమిన్లు ఉండి బిడ్డ మెదడుకు వికాసానికి తోడ్పడుతాయి. లాక్టోజుతో కాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయి.
- తొలి నెలలో శిశువులకు వివిధ రకాల అంటువ్యాధుల బారి నుంచి కాపాడుతాయి. డయేరియా, నిమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల రాకుండా నిరోధిస్తాయి. క్యాన్సర్, చెవికి సంబంధించిన వ్యాధులు, గుండెవ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.
- అలర్జీ, ఆస్తమా, డయాబెటీస్ వంటి వ్యాధులూ రావు
- బాల్యంలో, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల ఒకటవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ సంవత్సరం 'తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం' అనే నినాదంతో ఈ కార్యక్రమాలతో అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా ముర్రుపాలు తప్పనిసరిగా బిడ్డకు పట్టించాలని సూచిస్తున్నాం. బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లులకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ల నివారణకు దోహదపడతాయని వివరిస్తున్నాం.

–డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్‌వో, కర్నూలు

తల్లిపాలతో బిడ్డకు అనుబంధం



బిడ్డ జన్మించిన అరగంట లోపే తల్లికి పాలు వస్తాయి. ఈ ముర్రుపాలను బిడ్డకు తప్పనిసరిగా పట్టించాలి. ఇందులో బిడ్డకు అవసరమైన వ్యాధినిరోధక శక్తి ఉండి వ్యాధులు రాకుండా కాపాడుతుంది. ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే పట్టించాలి. ఈ పాల ద్వారా బిడ్డకు అవసరమైనంత పోషకాలు, విటమిన్లు, కాల్షియం, ప్రొటీన్ అందుతాయి. లైఫేజ్ అనే ఎంజైమ్ వల్ల బిడ్డ జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ముఖ్యంగా బిడ్డకు తల్లి పాలివ్వడం వల్ల వారిద్దరి మధ్య బాంధవ్యం బలపడుతుంది.

– డాక్టర్ ఎం. విజయవాణి, చిన్నపిల్లల వైద్యనిపుణులు, కర్నూలు

పట్ట పగలే చోరీ



బీరువా పగులగొట్టిన దృశ్యం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం విజయా నికేతన్ పాఠశాల సమీపంలో ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన జక్కుల మద్దిలేటి దొంగు వద్ద ఉన్న హోటల్ వంట మాస్టర్‌గా పని చేస్తున్నారు. రోజులాగే తెల్లవారుజామున ఉదయం 5 గంటలకు భార్యాభర్తలు హోటల్‌కు వెళ్లారు. ఆ సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి మూడు బీరువాలను పగులగొట్టి రూ. 60 వేలు నగదు, ఒక ఉంగరాన్ని అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. దొంగలు చోరీకి ఉపయోగించిన సుత్తి, ఇనుపరాడ్డును అక్కడే వదిలేయడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సమాచారం అందించడం ప్రభుత్వ బాధ్యత

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి పీఎల్ వరలక్ష్మి



కిట్లను అందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారిణి పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అర్బన్): పాలనా వ్యవహారాల్లో గోప్యతను నివారించి ప్రభుత్వ విధానాలను ప్రజల ముందు ఉంచేందుకు పౌరులకు కల్పించిన అద్భుత అవకాశమే సమాచార హక్కు అని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి పీఎల్ వరలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మద్దూర్‌నగర్‌లోని ప్రకృతి వ్యవసాయ హాల్‌లో సమాచార హక్కు చట్టం –2025పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాధురి, సీనియర్ కన్సల్టెంట్స్ లక్ష్మయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ సమాచారాన్ని ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని, సమాచారాన్ని పొందడం పౌరుల హక్కు అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రకృతి వ్యవసాయ పంట కొత్త ప్రయోగానికి సంబంధించిన 32 కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లను ఉపయోగించుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన పంట ఉత్పత్తుల దిగుబడులను కచ్చితమైన దిగుబడిని అంచనా వేసేందుకు ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీపీఎంయూ సిబ్బంది, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్, లావణ్య, ఎస్‌ఎఫ్‌ఏస్ తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా ఇసుక దందా

- వాహన యజమానులకు టీడీపీ నేతల బెదిరింపులు
- టన్ను ఇసుక రూ. 500కే తమకివ్వాలని ఒప్పందం
- అక్రమంగా ఇసుక డంప్ చేసి వ్యాపారం



పట్టణ శివారులో అధికార పార్టీ నేతలు అక్రమంగా డంప్ చేసిన ఇసుక

డోన్: ఇసుక ఉచితంగా అందిస్తామని.. భవన నిర్మాణ రంగాన్ని గాడిలో పెడతామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు దర్జాగా ఇసుక దందాకు పాల్పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇసుక తెచ్చి స్థానికంగా డంప్ చేసి అక్రమ వ్యాపారం చేస్తున్నా రు. ప్రతి నెల లక్షలాది రూపాయలు అక్రమార్జన చేస్తున్నారు. డోన్, బేతంచెర్ల చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అనంతపురం జిల్లా పామిడి, తాడిపత్రితో పాటు నెల్లూరు జిల్లాకు వివిధ ఖనిజాలను లారీల్లో తరలిస్తున్నారు. తిరుగు ప్రయాణంలో పెన్నా నది ఇసుకను టన్ను రూ.220 చొప్పున కొనుగోలు చేసి డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో టన్ను రూ.550 చొప్పున విక్రయిస్తుండేవారు. ఈ క్రమంలో అధికార పార్టీ నేతల కళ్లు ఇసుక అక్రమ రవాణాపై పడింది. కొత్తబస్టాండ్ సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి వద్ద ఇసుక రవాణా చేసే టిప్పర్, లారీ యజమానులందరినీ సమావేశ పరిచి టన్ను ఇసుక రూ.500 ప్రకారం తెచ్చి ఇవ్వాలని హుకుం జారీ చేశారు. అదే ఇసుకను భవన నిర్మాణ యజమానులకు టన్ను రూ.900 చొప్పున అమ్ముకుంటామని లేదంటే, పోలీసుల ద్వారా వేధింపులు అధికం చేయడమే కాక ఆర్థికంగా నష్టపోయేట్లు చేస్తామని హెచ్చరించారు. దీంతో టిప్పర్, లారీ కిరాయి, డ్రైవర్ బత్తా, డీజిల్ అన్ని కలిపి టన్ను ఇసుక రూ.550కు ఇచ్చేందుకు అంగీకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక బట్టీల సెంటర్‌లోని ధర్మవరం రోడ్డులో మూతపడిన గ్రానైట్ ఫ్యాక్టరీ ఆవరణలో అధికార పార్టీ నేతలు ఇసుక డంప్ ఏర్పాటు చేసి దోపిడీకి రంగం సిద్ధం చేశారు. సామాన్యుడు తమ గృహ నిర్మాణాలకు ఎడ్లబండ్లు, ఆటోలలో ఇసుక తరలిస్తే పట్టుకొని వేధించే రెవెన్యూ, పోలీసు, ఏడీఎంఈ అధికారులు అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఇసుక డంప్ గురించి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఆర్టీసీ బస్టాండ్లలో మెరుగైన వసతులు



బనగానపల్లె డిపోలో ఏర్పాటు చేసిన సీటింగ్ చైర్లు

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రజియాసుల్తానా శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని బనగానపల్లె, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, కోవెలకుంట్ల, డోన్ డిపోలలో సీటింగ్ చైర్స్ వేయడం జరుగుతుందన్నారు. నంద్యాలలో 20 ఫ్యాన్లు, బనగానపల్లెలో 8 ఫ్యాన్లు ఏర్పాట్లు చేశామన్నారు. 23 హైటెక్ బస్సులలో పల్లెవెలుగుగా మార్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థి బస్సుల ద్వారా రద్దీ ఎక్కువగా ఉన్న రూట్లలో అదనపు ట్రిప్పులు తిప్పుటకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జిల్లాకు 36 సూపర్‌లగ్జరీ, 32 ఎక్స్‌ప్రెస్ బస్సులు రావడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని పల్లెవెలుగు బస్సుల కండీషన్ చెక్ చేసి అవసరమైన మరమ్మతులు చేయబడుతుందన్నారు. ఉచిత టికెట్ జారీ చేసే పద్ధతి గురించి కండెక్టర్లకు, డ్రైవర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

రోజా దర్గా భూమి అన్యాక్రాంతం

కర్నూలు(అర్బన్): కర్నూలులోని సయ్యద్ ఇషాక్‌సనుల్లా ఖాద్రి అలియాస్ సయ్యద్ ఖాద్రి మియా సాహెబ్ (అర్‌హెచ్) రోజా దర్గాకు సంబంధించి సర్వే నంబర్ 218లోని 19.65 సెంట్ల భూమి అన్యాక్రాంతమైనట్లు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ముక్తార్ బాషా తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆదేశాల మేరకు.. కల్లూరు పరిధిలోని ముజఫర్‌నగర్ ప్రాంతంలో ఉన్న ఈ భూమిని క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ భూమి వెంచర్ ప్లోటింగ్ అయ్యిందని, ఆక్రమణ, అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు కూడా జరిగినట్లు తమ పరిశీలనలో తెలిసిందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాగే జిల్లా కలెక్టర్ ద్వారా ఆర్‌డీఓ, జిల్లా రిజిస్ట్రార్‌కు నివేదికలు అందించామన్నారు. భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆస్తి రాబట్టుకునేందుకు బాలుడి కిడ్నాప్

- 24 గంటల్లో ఛేదించిన పోలీసులు



బాలుడిని కిడ్నాప్ చేసిన నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: కర్నూలు రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామ శివారు స్కందాన్షి వెంచర్‌కు చెందిన బాలుడు మోక్షిత్ (10) అదృశ్యం కేసు తెర పడింది. తెలుగు సురేష్, విజయలక్ష్మి దంపతుల కుమారుడు మోక్షిత్ లక్ష్మీపురంలోని రామ కృష్ణ విద్యా మందిర్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. గురువారం స్కూల్ నుంచి ఇంటికి రాకపోవడంతో తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ, నాగలాపురం ఎస్‌ఐలు ధనుంజయ, శరత్ కుమార్ రెడ్డి తదితరులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టగా బాలుడు ఇంట్లోనే నివాసమున్న వెల్దుర్తి మండలం మల్లెంపల్లె గ్రామానికి చెందిన మనోహర్ నాయుడు బాలుడి కుటుంబ సభ్యులను భయపెట్టి డబ్బులు, ఆస్తిని రాబట్టుకునేందుకు కిడ్నాప్ చేసినట్లు బయటపడింది. మనోహర్ నాయుడు అదృశ్యమైన బాలుడు మోక్షిత్‌తో పాటు వెల్దుర్తి రైల్వే స్టేషన్ ఎదురుగా క్రిష్ణగిరి టర్నింగ్ వద్ద కర్నూలుకు వచ్చే దారిలో కారులో ఉండగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా ఆస్తిని రాబట్టుకునేందుకు తానే కిడ్నాప్ చేసినట్లు మనోహర్ నాయుడు నేరాన్ని అంగీకరించాడు. శుక్రవారం సాయంత్రం కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ ఎదుట హాజరు పరిచారు. సీఐ చంద్రబాబు నాయుడుతో కలసి డీఎస్పీ కిడ్నాప్ వ్యవహారం విషయాలను వెల్లడించారు. అదృశ్యమైన బాలుడిని 24 గంటల్లో వెతికిపట్టి తల్లిదండ్రులకు అప్పగించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఎనిమిది నెలలుగా జీతాలు లేవు



పంచాయతీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న జెడ్పీ సీఈఓ

హొళగుంద: తమకు ఎనిమిది నెలలుగా జీతాలు రావడం లేదని, చాలా ఇబ్బందులు ఉన్నాయని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి దృష్టికి గ్రీన్ అంబాసిడర్లు తీసుకెళ్లారు. గ్రామానికి వచ్చే నిధుల్లో ముందుగా గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వాలని సెక్రటరీకి, సర్పంచ్‌కు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మార్లమడికి గ్రామంలో జెడ్పీ సీఈఓ పర్యటించారు. గ్రామంలో బళ్లారి రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి శిథిలావస్థకు చేరిన గదులను వాడొద్దని ఉపాధ్యాయులకు సూచించారు. ఐవీఎస్ఆర్ కాల్స్‌లో గ్రామానికి జీరో శాతం రావడంతో పంచాయతీ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రాలేదని, పనులు ఎలా చేయాలని గ్రామ సర్పంచ్ తనయుడు రమేశ్ ప్రశ్నించారు. హొళగుంద ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలలిత, ఈఓపీఆర్డీ చక్రవర్తి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో జెడ్పీ సీఈఓ సమీక్ష నిర్వహించారు.

ఫైనాన్షియర్ ఇంట్లో పోలీసుల సోదాలు



ఫైనాన్షియర్ ఇంట్లో పత్రాలను పరిశీలిస్తున్న త్రీటౌన్ సీఐ, సిబ్బంది

ఆదోని అర్బన్: పట్టణంలోని టీజీఎల్ కాలనీలో నివాసముంటున్న యోగేష్ అనే ఫైనాన్షియర్ ఇంట్లో శుక్రవారం త్రీటౌన్ పోలీసులు సోదాలు చేశారు. త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సాయిబాబానగర్‌కు చెందిన బసవరాజుకు మండిగిరి పరిధిలో 3 ఎకరాల భూమి ఉంది. ఆయన అవసరాలకు స్థానిక టీజీఎల్ కాలనీలో నివాసముంటున్న సురేష్ శివలాల్ ఫైనాన్షియర్‌తో మూడు ఎకరాలు మార్ట్‌గేజ్ చేసి 2019లో రూ.1.80 కోట్లు రుణం తీసుకున్నాడు. అయితే ఆరు నెలల క్రితం సురేష్ శివలాల్ మృతి చెందాడు. బసవరాజు తన పొలాన్ని విడిపించుకోవడానికి వెళ్తే తన తండ్రికి అప్పుడే అమ్మేశావు కదా అని సురేష్ శివలాల్ కుమారుడు యోగేష్ చెప్పాడు. దీంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో యోగేష్‌పై ఈ ఏడాది జూన్ 3వ తేదీన త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బసవరాజ్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అయితే అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో రుణాలు ఇస్తున్నట్లు విచారణలో తేలడంతో శుక్రవారం డీఎస్పీ హేమలత అనుమతితో యోగేష్ ఇంట్లో తనిఖీ చేసినట్లు సీఐ తెలిపారు. యోగేష్ ఇంట్లో రిజిస్ట్రేషన్ పత్రాలు, డాక్యుమెంట్లు పరిశీలించామన్నారు. తనిఖీలో ఎస్‌ఐ రామస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సొంత వాహనదారులకు కొత్త ప్లాన్

- ధర రూ.3 వేలు.. గరిష్టంగా 200 ట్రిప్పులు
- టోల్ ప్లాజా ఎంట్రీ నుంచి ఎగ్జిట్‌కు ఒక ట్రిప్పుగా పరిగణన

ఇక వార్షిక ఫాస్టాగ్



కర్నూలు: సొంత వాహనదారుల టోల్‌ప్లాజా కష్టాలు తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పాలసీతో ముందుకొచ్చింది. జాతీయ రహదారులపై తరచుగా ప్రయాణించే వ్యక్తిగత వాహనదారుల ప్రయాణ ఖర్చులను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గరిష్ఠంగా 200 ట్రిప్పులకు అనుమతిస్తూ వార్షిక ఫాస్టాగ్ ఆఫర్‌ను ఈ నెల 15 నుంచి దేశ వ్యాప్తంగా అమలులోకి రానుంది. రూ.3 వేలు చెల్లింపుతో ప్రత్యేక టోల్ పాస్‌ను ఎవరైనా వ్యక్తిగత వాహనదారులు పొందవచ్చు. ఇది ఒక సంవత్సరం లేదా 200 టోల్ ప్రయాణాల వరకు వర్తిస్తుంది. జాతీయ రహదారుల టోల్ ప్లాజాలపై ఇది అమలు కానుంది. కావాలనుకున్న వాహనదారులు మాత్రమే వార్షిక పాస్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వార్షిక పాస్ అనేది పూర్తిగా స్వచ్ఛందం.

ఈ నెల 15 నుంచి అమలులోకి..

ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15వ తేదీ నుంచి ఈ ఫాస్టాగ్ ఆఫర్ అందుబాటులోకి రానుంది. టోల్ ప్లాజాను దాటిన ప్రతిసారి ఒక ట్రిప్పు గా లెక్క కడతారు. ఉదాహరణకు మనం ప్రయాణంలో 4 టోల్ ప్లాజాలు దాటితే 4 ట్రిప్పులు పూర్తయినట్లు లెక్కిస్తారు. ఈ లెక్కన వార్షిక ఫాస్టాగ్ పాస్ అనేది 200 సార్లు మాత్రమే పని చేస్తుంది. మొత్తం పూర్తి కాకపోతే ఏడాదంతా ఈ పాస్ పనిచేస్తుంది. ఈ రెండింటిలో ఏది ముందుగా ముగిస్తే దానిని ఫాస్టాగ్‌కు తుది గడువుగా పరిగణిస్తారు.

ఎవరికి వర్తిస్తుందంటే...

ఫాస్టాగ్ ఉన్న వ్యక్తిగత వాహనదారులకు మాత్రమే వర్తిస్తుంది. టోల్ ఫీజు ఎంత ఉన్నా సంబంధం లేకుండా టోల్ ప్లాజా దాటవచ్చు. ప్రవేశం-నిష్క్రమణను ఒకే దాటుగా పరిగణిస్తారు. ఇది ప్రయాణ ఖర్చులను తగ్గించి వేగవంతమైన టోల్ క్లియరెన్స్‌కు దోహదపడుతుంది. పాస్‌ను టోల్ ప్లాజాలో లేదా ఆన్‌లైన్‌లో పొందవచ్చు.

కర్నూలు-కడప హైవేలో వేలాది మందికి ఉపయోగం



రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేటు లిమిటెడ్ ద్వారా నిర్వహిస్తున్న కర్నూలు నుంచి కడప వరకు 40వ నంబర్ జాతీయ రహదారిలో ప్రయాణించే వేల మంది ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగకరం. ఈ మార్గాన్ని వినియోగించే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారవేత్తలకు ఇది ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. కేంద్రం తీసుకొచ్చిన ఈ నిర్ణయం డిజిటల్ ఇండియా స్మార్ట్ మౌలిక సదుపాయాల లక్ష్యానికి అనుగుణంగా ఉంటుంది. – వి.మదన్‌మోహన్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేటు లిమిటెడ్ ప్రాజెక్ట్ హెడ్

సంతెకూడ్లూరులో ఘర్షణ





గాయపడిన మదిరె వీరేష్, మహేష్

ఆదోని అర్బన్: సంతెకూడ్లూరు గ్రామంలో టీడీపీ, బీజేపీ వర్గీయుల మధ్య బుక్ కీపర్ విషయంలో శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. బీజేపీకి చెందిన మహేష్ భార్య గాయత్రీ బుక్ కీపర్‌గా పనిచేస్తోంది. గత నెల నుంచి ఆమెను తీసివేసి టీడీపీకి చెందిన వీరేష్ భార్య సువార్తమ్మను నియమించారు. ప్రస్తుతం టీడీపీకి చెందిన సువార్తమ్మ గ్రామంలో ఫేష్ యాప్ ద్వారా వివరాలు రికార్డు చేస్తున్నారు. బీజేపీకి చెందిన వారు ఎవరు ఫేష్ యాప్ చేసుకోవద్దని ప్రచారం చేసినట్లు తెలిసింది. ఇలా ప్రచారం చేయడం తెలుసుకున్న టీడీపీకి చెందిన వారు నేరుగా బీజేపీ వారిని నిలదీశారు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడిలో బీజేపీకి చెందిన మహేష్, టీడీపీకి చెందిన మదిరె వీరేష్‌కు గాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు గాయపడిన వారిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.